యువగళానికి ఘన స్వాగతం

- జిల్లాలోకి ప్రవేశించిన లోకేష్ పాదయాత్ర - తొలి రోజు రంగాపురం నుంచి గుడిపాడు వరకు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/ప్యాపిలి

ఉమ్మడి కర్నూలు జిల్లాలోకి నారా లోకేష్ యువగళం పాదయాత్ర గురువారం ప్రవేశించింది. డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలం డి.రంగాపురం వద్ద లోకేష్‌కు టిడిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో డోన్ ఇన్‌ఛార్జీ సుబ్బారెడ్డి, బీసీ.జనార్ధన్ రెడ్డి, కెఇ.శ్యాంబాబు, గౌరు వెంకట రెడ్డి, గౌరు చరితా రెడ్డి, భూమా అఖిల ప్రియ, కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ, మీనాక్షి నాయుడు, తిక్కా రెడ్డి, కెఇ.ప్రభాకర్, ఎన్ఎమ్‌డి.ఫరూక్, బిటి.నాయుడు, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఏరాసు ప్రతాపరెడ్డి, బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి, శివానంద రెడ్డి, టిజి.భరత్, భూమా బ్రహ్మానంద రెడ్డి, ఎవి.సుబ్బారెడ్డి, టిడిపి బీసీ సాధికారత చైర్మన్ నాగేశ్వర్ రావు యాదవ్, మురళీ కృష్ణ గౌడ్, వలసల రామకృష్ణ, సుబ్బయ్య, రామ్మోహన్, సుంకయ్య, సుంకయ్య, ఖాజా పీర్, సుదర్శన్, రామాంజినేయులు, నాగేంద్ర, మల్లి, అభి, అనుదీప్ ఉన్నారు. అక్కడి నుంచి జక్కసానికుంట్ల వద్ద ఎస్సీ సామాజికవర్గ ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించారు. టిడిపి అధికారంలోకి రాగానే దళితవాడల్లో శ్మశానానికి స్థలాలు కేటాయిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చాక వైసిపి ప్రభుత్వం దళితులపై పెట్టిన అక్రమ కేసులు రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. రాయితీ రుణాలను రీ షెడ్యూల్ చేసి, లబ్ధిదారులను ఆదుకుంటామన్నారు.

నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహిస్తున్న లోకేష్

లోకేష్‌కు గజమాల వేస్తున్న నాయకులు, అభిమానులు

చెరువుకుంట మరమ్మతులు చేయించాలి

- లోకేష్‌ను కలిసిన నల్లమేకలపల్లె గ్రామస్తులు

చెరువుకుంట మరమ్మతులు చేయించి ఆదుకోవాలని నల్లమేకలపల్లె గ్రామస్తులు లోకేష్‌ను కలిసి విన్నవించారు. గ్రామంలోని చెరువుకుంట శిథిలావస్థకు చేరుకుందని, మరమ్మతులు చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని తెలిపారు. చెరువుకుంటలో నీళ్లుంటేనే బోర్లకు నీరు పుష్కలంగా అందుతుందని, వ్యవసాయం బాగుంటుందని వివరించారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ... తాము అధికారంలోకి వచ్చాక చెరువుకుంటకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. నల్లమేకలపల్లెలో వ్యవసాయం, పశువులకు నీటి సమస్యలేకుండా చేస్తామన్నారు.

సిసి రోడ్లు లేవు..డ్రెయినేజీ సమస్య

- లోకేష్‌ను కలిసిన పిఆర్.పల్లె గ్రామస్తులు

గ్రామంలో ప్రధానంగా డ్రెయినేజీ సమస్య ఉందని, ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ ఉండడం వల్ల నిత్యం అనారోగ్యం పాలవుతున్నామని పిఆర్.పల్లె గ్రామస్తులు నారా లోకేష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. కొన్ని వీధుల్లో సిసి రోడ్లు లేవని తెలిపారు. టిడిపి పాలనలో మంజూరైన ఇళ్లకు వైసిపి ప్రభుత్వం బిల్లులు నిలిపేసిందని చెప్పారు. వీటిపై లోకేష్ స్పందిస్తూ... అధికారంలోకి వచ్చాక పిఆర్.పల్లెలో డ్రెయినేజీ, సిసి రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. బిల్లులు ఆపేసిన ఇళ్లకు బిల్లులను విడుదల చేస్తామన్నారు. అక్కడి నుంచి గుడిపాడుకు చేరుకుని ప్రత్యేక శిబిరం వద్ద రాత్రి బస చేశారు. గురువారం మొత్తంగా 15.6 కిలోమీటర్లు యాత్ర సాగింది.

నేడు యాత్ర సాగనుంది ఇలా...

7.00 – గుడిపాడు క్యాంప్ సైట్ నుంచి పాదయాత్ర ప్రారంభం.
7.10 – గుడిపాడులో స్థానికులతో మాటామంతీ.
8.30 – హెచ్ఆర్.పల్లెలో యాదవులతో సమావేశం.
9.25 – పూదొడ్డి, మందొడ్డి క్రాస్ వద్ద మామిడి రైతులతో భేటీ.
11.00 – ప్యాపిలి శివార్లలో భోజన విరామం.
4.00 – ప్యాపిలి శివార్ల పాదయాత్ర కొనసాగింపు.
4.45 – ప్యాపిలి నీలకంఠేశ్వరస్వామి గుడి వద్ద స్థానికులతో సమావేశం.
4.55 – ప్యాపిలి బీసీ కాలనీలో 900 కిలోమీటర్ల మైలురాయి చేరిక, శిలాఫలకం ఆవిష్కరణ.
5.30 – ప్యాపిలిలో బహిరంగ సభ.
7.30 – పొలిమేరమెట్ట విడిది కేంద్రంలో బస.

మహిళతో మాట్లాడుతున్న నారా లోకేష్

సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేష్

ఉద్యమ కెరటం కెవిపిఎస్

- నేడు డాక్టర్ బాబాసాహెబ్ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుగన్న అసమానతలు , కులవివక్ష లేని సమాజం కోసం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) నిరంతర కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సామాజిక న్యాయం కోసం పాటుపడతామనే పాలకులు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం చేయడంలో చొరవచూపడంలేదు. అధికారంలో ఉండే వారు దళితులపై అఘాయిత్యాలకు పాల్పడం. సంఘటన జరిగిన తరువాత దళితులు అధికార పార్టీల పక్షాన చేరడంతో నిందితులను సరయిన శిక్షలు పడకుండా తప్పించుకుంటున్న ఘటనలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈనేపథ్యంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరంతర కార్యక్రమాల ద్వారా బాధితుల పక్షాన పోరాడుతుంది. నేడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయా ఘటనలపై కెవిపిఎస్ ప్రతిఘటన పోరాటాలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం....

వలన గత సంవత్సర కాలంలో కెవిపిఎస్ అణగారిన దళితులకు అండగా అనేక ఉద్యమాలను నిర్వహించింది. 2022 జనవరి 3న చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కర్నూలుకు 20 కిలోమీటర్ల దూరంలో కోడుమూరు మండలం అనుగొండ గ్రామంలో నేటికీ కొనసాగుతున్న అంటరానితనం పై ప్రతిఘటన పోరాటాన్ని నిర్వహించి దళితులకు సమాన అవకాశాలు కల్పించింది. హోళగుంద మండలం పెద్ద గొనెహాల్ గ్రామంలో కత్తులు, గడ్డపారలు, చెలకలు, ఇతర మారణాయుదాలతో దళితుల ఇళ్లపై పడి బీభత్సం సృష్టించిన ఘటనపై జిల్లా వ్యాప్త ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిఘటన నిర్వహించినా సరే బస్టాండును శుభ్రం చేసి, సామాజిక ఉద్యమ నాయకుల చిత్రపటాలను చించిన అనుగొండ ఆదిపత్య వర్గాలపైన హోళగుంద మండలం పెద్ద గొనె హాల్ లో బీభత్సం సృష్టించిన వారిపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జనవరి 26, 27న రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. కౌతాళం మండలం కామవరం గ్రామంలో దళితులను అత్యంత కిరాతకంగా నరికి పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనపై 27న కలెక్టరేట్ ముందు ఆందోళనతో ప్రారంభించి దోషులను అరెస్టు చేసేదాకా బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే దాకా పోరాటం నిర్వహించారు. కర్నూలు మండలం పసుపుల గ్రామంలో దళితులు వేసుకున్న కొట్టాలను బుల్డోజర్లతో పెకిలించిన ఘటన పైన, దేవనకొండ మండలం కుంకునూరు గ్రామంలో దళితులను దేవాలయంలోకి రాకుండా అడ్డుకున్న ఘటన పైన, ఆస్పరి మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం పై దాడికి నిరసనగా ఉద్యమాలు నిర్వహించారు. చనిపోయిన వారికి స్మశానంలో గుంతలు తీస్తూ, కట్టెలు పేర్చి కాలుస్తూ వృత్తి నిర్వహించే కాటికాపరుల సమస్యలపై వృత్తిదారులందరినీ ఐక్యపరిచి సంఘంగా ఏర్పడి గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి దాకా నల్ల చొక్కా తెల్ల పంచ ఎర్ర కండువా చేతిలో కర్ర ఆయుధంగా ఆత్మగౌరవ ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. సెప్టెంబర్ 4న ఆదోని మండలం సంతె కుడ్లూరు గ్రామంలో దళితులు ఏర్పాటు చేసుకున్న వినాయకున్ని ఊరిలో వీధుల్లో తిరగనివ్వకుండా, నిమజ్జనం చేయకుండా అడ్డుకున్న ఘటనపై జిల్లా వ్యాప్త ఆందోళనలు నిర్వహించి సెప్టెంబర్ 17న సంతె కుడ్లూరు గ్రామంలో కొనసాగుతున్న అన్ని రకాల వివక్షతలపై ప్రతిఘటన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన ఆమోష్ ను అతి కిరాతకంగా చంపిన ఘటనపై ఆందోళన నిర్వహించారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో దళితుల భూమిని కబ్జా చేయడమే కాకుండా కుటుంబం పై దాడి చేసిన ఎమ్మెల్యే అనుచరులను అరెస్టు చేయాలని ఆందోళన నిర్వహించడంతోపాటు భూమిని కలెక్టర్ ప్రత్యేక పరిశీలన ద్వారా దళిత కుటుంబానికి అప్పగించాం. హోళగుంద మండలం హెబ్బటం గ్రామంలో దళిత వెంకటేష్ పొలంలో దొంగతనం చేయడమే కాక, వెంకటేష్‌ను చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటనపై కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. రాయలసీమ యూనివర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల నిరసిస్తూ వారిని అరెస్టు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్త ఆందోళనలు నిర్వహించారు. జిల్లాలో దళితులపై జరుగుతున్న దాష్టికాలకు అడ్డుకట్ట వేయకపోతే సామాజిక తిరుగుబాటు తప్పదంటూ నవంబర్ 28న కిసాన్ ఘాట్ నుండి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం దాకా పదివేల మందితో భారీ ప్రదర్శన చేసి, బహిరంగ సభ నిర్వహించారు. అణగారిన వర్గాలకు అండగా నిరంతర పోరాటాలు నిర్వహిస్తూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుగన్న కులం లేని సమాజ నిర్మాణం కోసం నిరంతరం పనిచేసే ఉద్యమ సంఘం కెవిపిఎస్ అని చెప్పక తప్పదు.

సంతేకుడ్లూరులో కెవిపిఎస్ ప్రతిఘటన కార్యక్రమంలో పాల్గొన్న విఎస్ఆర్ (ఫైల్)

సిఎంను కలిసిన కలెక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జి.సృజన మర్యాదపూర్వకంగా కలిశారు. ఇవాళ రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఇతర ఉన్నత అధికారులు కూడా జిల్లా కలెక్టర్ కలిశారు.

మే 15 నాటికి జగనన్న విద్యాకానుక సిద్ధం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మే 15 నాటికి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర పరిశీలకులు ఆర్ నరసింహారావు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో నాలుగో సంవత్సరం ప్రభుత్వం సరఫరా చేసే జగనన్న విద్యా కానుక లోని వస్తువులను నిల్వచేసి కృష్ణగిరి, వెల్దుర్తి మండల కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో పంపిణీ చేయడానికి మండల స్థాయిలో ఎనిమిది టీంలను ఏర్పాటు చేశామన్నారు. జరిగిందన్నారు. జగనన్న విద్యా కానుకలను నిల్వ చేయడం, నమోదు చేయడం, వస్తువులను కిట్‌గా చేసి పాఠశాలలకు పంపిణీ చేయడం ఎంఇఓ అధ్యక్షతన ఉండే టీం చూడాలన్నారు. మండల నిల్వ కేంద్రానికి వచ్చిన విద్యా కానుక వస్తువులు నాణ్యమైనవా కాదా అని మండల స్థాయిలో మండల ఇంజనీర్, ఎపిఎంలు చూడాలన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ కిట్లను సకాలంలో అందజేసేందుకు ముందస్తుగా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎస్ఎ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ కూడా ఉన్నారు.

స్టాక్ పాయింట్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రీ సర్వే పనుల వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రీ సర్వే పనులను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లా కలెక్టర్లను భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఆదేశించారు. గురువారం విజయవాడ నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పొలాల్లో సరిహద్దు రాళ్లను త్వరితగతిన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే ప్రక్రియకు చెందిన గ్రామాల భూముల వివరాలను వెబ్ ల్యాండ్ 2.0లో ఎక్కించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా భూహక్కు పత్రాలలో ఫోటో మిస్సింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ముందుగా జాయింట్ కలెక్టర్ ఎన్.మౌర్య సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిసిపి పాయింట్స్ , సరిహద్దు రాళ్లకు సంబంధించి ఒక సమావేశం నిర్వహించి ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సర్వే అధికారులను ఆదేశించారు. అదే విధంగా చెక్ పాయింట్స్‌ను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్ఓ నాగేశ్వర రావు, ప్రొబేషనరీ డెప్యూటీ కలెక్టర్ ఎన్.మనోజ్‌రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

హెచ్ఆర్‌సిలో అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ జస్టిస్ మాంధాత సీతారామమూర్తి కమిషన్ సభ్యులు జ్యుడీషియల్ దండే సుబ్రహ్మణ్యం , డాక్టర్ గోచిపాత శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలు ఘటించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ కార్యదర్శి సంపర రమణమూర్తి, పిఆర్ఓ కోనేటి రవికుమార్, విభాగాధికారులు జి.సునీత, బొగ్గరం తారక నరసింహ కుమార్, కమిషన్ సిబ్బంది పోలీస్ ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

బిజెపిని సాగనంపుదాం - దేశాన్ని కాపాడుకుందాం

ప్రచార భేరి గోడ పత్రికలు విడుదల

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి: ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపి, దేశాన్ని కాపాడుకుందాం అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. గురువారం పత్తికొండ చదువుల రామయ్య భవనంలో ఈనెల 14 నుండి 30 తేదీ వరకు సిపిఐ, సిపిఎంలు తలపెట్టిన ప్రచార భేరి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ శక్తుల ముందు మోకరిల్లి, దేశంలో ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి పౌరుడు గొంతెత్తి నిలదీయ వలసిన సమయం ఆసన్నమైందన్నారు. దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువల పరిరక్షణ, ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో అభివృద్ధిని గాలికి వదిలేసిందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 14 నుండి 30వ తేదీ వరకు తలపెట్టిన ప్రచార బేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పి.భీమలింగప్ప, సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, తిమ్మయ్య, కారన్న, కారుమంచి, వామపక్ష ప్రజా సంఘాల నాయకులు రంగన్న, నెట్టికంటయ్య, మాదన్న, జొహరాపురం కాశి, ఓబులేసు, వెంకటేశ్వర రెడ్డి, గోపాల్, సిద్దయ్య గౌడ్, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రచారభేరి గోడపత్రికలను విడుదల చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

జగనన్న నువ్వే మా భవిష్యత్తు కరపత్రాన్ని అందజేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

జగన్ పాలన జనరంజకం : కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన రంజకమైన పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 35 వ వార్డు 89 వ సచివాలయం చింతలముని నగర్ లో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కర్నూలు , నంద్యాల రీజినల్ కో–ఆర్డినేటర్ ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి, కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, స్థానిక వార్డ్ కార్పొరేటర్ సాపురు మాధురి, నాయకులు సాపూరు వీరయ్య, కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ మెంబర్ సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంత్ రెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, కాశపోగు జయరాముడు, కో–ఆప్షన్ మెంబర్ కృష్ణమూర్తి, శివ శంకరరెడ్డి, బెల్లం మహేశ్వర రెడ్డి, నల్లబోలు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

జెసిని కలిసిన ' మెడికవర్' యాజమాన్యం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి నారపరెడ్డి మౌర్యను కర్నూలు మెడి కవర్ హాస్పిటల్స్ యాజ మాన్యం గురువారం మర్యాదపూర్వకంగా కలి సింది. హాస్పిటల్స్‌లో అం దించే వివిధ రకాల వైద్య సేవలు, వైద్య విభాగాలు వాటి వివరాల జాయింట్ కలెక్టర్‌కు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి వివరించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో తమ హాస్పిటల్‌లో అందించిన వైద్య సేవలకు తమరు అందించిన సహాయ సహకారాలు మరువరానివాని తెలిపారు. ఇప్పుడు కూడా అదే ఉత్సాహంతో పని చేస్తామని, చిన్నపిల్లల (పీడియాట్రిక్–లెవెల్3) విభాగాన్ని ప్రారంభించామన్నారు. కొత్తగా ఆంకాలజీ విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో అత్యాధునిక వైద్య సేవలను అందిపుచ్చుకోవడానికి మా హాస్పిటల్స్ ఎప్పుడు ముందుంటుందన్నారు. ప్రతి రోజు మా వైద్య ప్రతినిధి బందం రెండు బృందాలుగా ఏర్పడి జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తుంటామని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్‌తో పాటు సెంటర్ హెడ్‌నీలా రెడ్డి , మార్కెటింగ్ బృందం ఉన్నారు.

జెసికి మొక్కను అందజేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, , తదితరులు

'యంత్ర సేవ'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ యంత్ర సేవా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం పాణ్యం నియోజకవర్గ పరిధిలోని ఓర్వకల్ మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయం దగ్గర వైఎస్ఆర్ యంత్రసేవా పథకం ద్వారా అర్హులైన రైతులకు ట్రాక్టర్లు పంపిణి చేశారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి రైతులకు ట్రాక్టర్లను యంత్రాలను అందజేశారు. కర్నూలు నగర మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి, ఓర్వకల్లు జడ్‌పిటిసి రంగానాథ్ గౌడ్, ఎంపిపి తిప్పన్న, ఓర్వకల్ సర్పంచ్ తోట అనూష, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, వైసిపి మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్ శ్వేతారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఓర్వకల్ ఎంపిడిఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రసంగించారు. అనంతరం డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం 3వ దశను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు.ఎంపిపి తిప్పన్న, ఓర్వకల్ గ్రామ సర్పంచి తోట అనూష, ఎమ్మార్వో ,ఎంపిడిఓ మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపిటిసి లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేద్కర్

వై.జయరాజు-సీనియర్ న్యాయవాది

ప్రజాశక్తి- కర్నూలు క్రైం

అంతర్జాతీయ మేధావి డాక్టర్ బాబాసాహేబ్ అంబేద్కర్. అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ఆయన మాటల్లోనే.... ఆయన కుల వ్యవస్థపై అప్పటి ప్రవచనాత్మక ప్రకటన ప్రస్తుతం నిజమైంది. కులవివక్ష భారతదేశ సరిహద్దులు దాటి వేగంగా వ్యాప్తి చెందుతుంది. దక్షణాసియా వెలుపల కులవివక్షకు వ్యతిరేకంగా మొదటి నిషేదం సియాటెల్ నగరంలో అమలులోకి వచ్చింది. పనిలో లేదా శ్రమలో కులవివక్ష అంతటా వ్యాపించడంలో ఆచ్చర్యం లేదు. అట్టడుగు వర్గాలను కులవిక్ష నిరంతరం వెంటాడుతోంది. వివక్షపై సరైన చట్టాన్ని రూపొందించాలని ఇంగ్లండులో కూడా తీవ్రమైన చర్చ మొదలైంది. దీనికి ప్రపంచ సమస్యగా గుర్తించి సంస్కరణాత్మక, చట్టపమైన చర్యలు అవసరం. అయితే దానిని హిందూఫోబిక్‌గా భావిస్తూ వివక్షతతో కూడిన బ్రాహ్మణత్వం దాని భావజాలంలో ప్రధాన భాగం కుల వివక్ష అని నిర్ధారణకు రాక తప్పదు. మనువాద బ్రాహ్మణీయ కులవాద ఆధిపత్య శక్తులు తమతో పాటు సాగించిన కులవివక్షను అంతం చేయడానికి యుఎస్ఎ, యుకె, ఆస్ట్రేలియాచ ఇతర దేశాలలో బలమైన చట్టాలను తీసుకోవడానికి ప్రారంభించండం హర్షించదగిన విషయం. అంబేద్కర్ ఎప్పుడో చెప్పిన విషయం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సాగడం అనేది పురోగామి చర్యలు హర్షించదగినవి. అయితే కుల వివక్ష నిర్మూలనకు చిత్తుశుద్ధితో పని చేయాలి.

దేశానికి దిక్సూచి అంబేద్కర్ : ఆకెపోగు జయన్న

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భారతదేశానికి దిక్సూచిగా నిలిచారని తాండ్రపాడు సర్పంచి ఆకిపోగు జయన్న అన్నారు. అంబేద్కర్ మహనీయుడు దేశ ప్రజల హక్కుల ప్రధాత... రాజ్యాంగ నిర్మాత. దేశ ప్రయాణమంతా తను రచించిన రాజ్యాంగం చట్రంపై పయనిస్తోంది. ఆయనే లేకపోతే నేడు కొన్ని వర్గాల వారికి కనీస జీవనం హక్కు కూడా కరువ య్యేది. దళితులు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పార్లమెంటులో ప్రత్యేక చట్టాలను కోసం పోరాడిన ధీరుడు. ఆయన ఆశయం కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలి. మా గ్రామంలో వచ్చే జయంతి నాటికి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం.

అందరివాడు బాబా సాహెబ్ అంబేద్కర్: బి.దస్తగిరి



మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కొందరి వాడు కాదని అందరి వాడు అని కర్నూలు మండల టిడిపి యువ నాయకులు బొగ్గుల దస్తగిరి అన్నారు. అంబేద్కర్132వ జయంతి సందర్భంగా ఆయన గురించి చెప్పిన మాటలు...... దేశంలో అంబేద్కర్ పట్ల కొంతమందికి తగినంత అవగాహన లేదు. అందుకే ఆయనను కేవలం దళితుల నాయకుడుగా చూస్తున్నారు. ఇది బాధాకరమైన విషయం. అంబేద్కర్ కేవలం దళితులకు మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజల మనిషిగా జీవించారు. ఆయన రచించిన రాజ్యాంగం సకలజనులూ ఆచరిస్తున్న విషయం తెలిసిందే. రాజ్యాంగమే దేశాన్ని శాసిస్తోంది. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలి. అప్పుడు ఆయనకిచ్చే నిజమైన నివాళి.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వం

- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ఆదోని పుర ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి తెలిపారు. గురువారం బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీటి సామర్థ్యాన్ని, ఎల్ఎల్‌సి కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో రోజు విడిచి రోజు పురవాసులకు తాగునీరు సరఫరా చేసినా వంద రోజులకు సరిపడే స్టోరేజ్ ఉందని తెలిపారు. అయినా ఎల్ఎల్‌సిలో నీటి ప్రవాహానికి అడ్డు వేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోకి నీటి పంపింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నీటి వృథా వల్ల కలిగే ఇబ్బందులను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.

నర్సప్పకొండ రక్షణ పనులు చేపట్టాలి

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

కొండ వద్ద ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

గోనెగండ్ల ఎస్సీ కాలనీలో ఎండవేడికి పగుళ్లు ఏర్పడి చీలికలు వచ్చిన నరసప్ప కొండ రక్షణ పనులను చేపట్టాలని ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కొండను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు, మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ... తగు చర్యలు వెంటనే తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇది ఇంతవరకు ప్రకృతి తప్పిదమని తెలిపారు. సంఘటన జరిగి నాలుగు రోజులు గడిచినప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే అది మానవతప్పిదంగా మారే అవకాశం ఉందని చెప్పారు. అప్పుడు దాని బాధ్యత ప్రభుత్వమే వహించాల్సి ఉంటుందని తెలిపారు. నరసప్ప కొండ రక్షణ పనులను చేపట్టి ఆ ప్రాంతంలోని ఇళ్లకు, ప్రజలకు ఎలాంటి నష్టమూ జరగకుండా చూడాలని కోరారు. సర్పంచి హైమావతి, ఉప సర్పంచి ఖాసీం, టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, తిరుపతయ్య నాయుడు, బేతాళ బడేసా, ఎర్రబాడు శీను, రమేష్ నాయుడు, అచ్చుగట్ల కొత్తింటి ఫక్రుద్దీన్, గౌవుండా రహమతుల్లా, పూజారి రంగస్వామి, మునిస్వామి పాల్గొన్నారు.

బాలికలకు సత్ప్రవర్తన అవసరం

- అసిస్టెంట్ జిసిడిఒ వేదముని ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - చిప్పగిరి

బియ్యం స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బాలికలకు చదువుతోపాటు సత్ప్రవర్తన అవసమని అసిస్టెంట్ జిసిడిఒ వేదముని తెలిపారు. గురువారం చిప్పగిరి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికలకు చదువుతోపాటు సత్ప్రవర్తన ముఖ్యమన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కస్తూరిబా గాంధీ బాలికల సంక్షేమ హాస్టల్‌లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థుల బాగోగులను చూసుకోవడంతో పాటు మెనూ సక్రమంగా ఉండాలన్నారు. అలాగే వంట సరుకులు నాణ్యత ఉండే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత ప్రిన్సిపల్‌పై ఉందని తెలిపారు. అనంతరం పాఠశాల రికార్డులను, విద్యార్థుల భోజనాన్ని, స్టాక్ రూమ్‌లో ఉన్న రేషన్ బియ్యాన్ని, పాఠశాల ప్రదేశాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ షబానా బేగం పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తూ, మున్ముందు కూడా బాధ్యతగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వానికి, కళాశాలకు మంచి పేరు తీసుకొస్తున్నందుకు అభినందించారు. ప్రతేడాదిలాగే ఈఏడాది కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించి చిప్పగిరి కళాశాల పేరు నిలబెట్టాలని తెలిపారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ మారుతి పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు...

- శుద్ధ జలం పేరుతో దోపిడీ - ప్రభుత్వ అనుమతుల్లేకుండా నీటి ప్లాంట్లు ఏర్పాటు
- కొలతలకు విరుద్ధంగా కెమికల్స్ - అనారోగ్యాల బారిన ప్రజలు - చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో వాటర్ ప్లాంట్ల యజమానులు నిబంధనలకు నీళ్లు వదిలారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కొలతలకు విరుద్ధంగా కెమికల్స్ కలుపుతున్నారు. ఈ నీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు...

చిప్పగిరిలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధ జల కేంద్రాలు

అధికారుల అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొందరు నీటి శుద్ధ జల కేంద్రాలను ఏర్పాటు చేసి దోపిడీకి పాల్పడుతున్నారు. చిప్పగిరి తహశీల్దార్ కార్యాలయ ఆవరణం పక్కన, బంబం స్వామి దర్గా ముందు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోడ్డు పక్కన శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా, అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా శుద్ధ జల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక బిందె రూ.7, రూ.8 చొప్పున అమ్ముతూ దోపిడీకి పాల్పడుతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిన అధికారులు మౌనంగా ఉండడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు శుద్ధజల కేంద్రాల నుంచి ముడుపులు ముట్టాయా..? లేక ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడంలో నిర్లక్ష్యమా..? అని విమర్శిస్తున్నారు. ఇష్టానుసారంగా శుద్ధజల కేంద్రాల్లో కెమికల్స్ పౌడర్ వేసి, నీటి దోపిడీకి పాల్పడుతున్నారు. ఆ నీటిని అమాయక ప్రజలు తాగి కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించి నిబంధనలను అమలు చేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. చిప్పగిరితో పాటు ఆయా గ్రామాల్లో నీటి దోపిడీ జరుగుతున్నా అధికారులకు మాత్రం కనబడదు, వినబడదని మండిపడుతున్నారు. తాగునీటి ఎద్దడిపైనా, నీటి సమస్యల పరిష్కారంపైనా సమావేశాలు, కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ అధికారులకు తెలియజేస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా నిమ్మకు నీరెత్తినట్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జల దోపిడీని ప్రభుత్వ అధికారులు అరికట్టి ప్రభుత్వ నిబంధనలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు తీసుకోవాలని చెప్పాం

- సంజన్న, ఇఒఆర్‌డి

అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ప్లాంట్ల యజమానులకు సూచించాం. వారు తీసుకోవడం లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

అంబేద్కర్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- న్యాయవాది చంద్రయ్య

ప్రజాశక్తి - ఆదోని

భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంత్యుత్సవాలను గ్రామ వార్డులో ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వమే ఘనంగా నిర్వహించాలని మాల మహానాడు లీగల్ అడ్వయిజర్, బార్ అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీ న్యాయవాది చంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికీ అంబేద్కర్ చిత్రపటాలు బహిరంగంగా ఉంచడం లేదన్నారు. జనవరి 26న అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసేందుకు కూడా కొందరు అధికారులు మొగ్గు చూపకపోవడం బాధాకరమన్నారు. అంబేద్కర్ అందరివాడన్న భావన రావాలన్నారు. ఎంతో కష్టపడి స్వాతంత్ర్య భారతదేశానికి పరిపాలన దిక్సూచి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ భవన్ నుంచి శ్రీనివాస్ భవన్ అంబేద్కర్ విగ్రహం వరకు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహిస్తామని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రాజ్యాంగ ఫలాలు పేదలకు చేరాలి

- ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయులు దైవప్రసాద్

ప్రజాశక్తి - ఆదోని

రాజ్యాంగ ఫలాలు పేదల దరిచేరాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయులు దైవప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడిచినా నేటికీ పేదరికంతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. అలాంటి వారిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న ప్రయోజనాలను పేదల దరి చేర్చడంలో ఇప్పటికీ సఫలీకృతం కాలేదన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకొని విజ్ఞానవంతులై జీవితంలో స్థిరపడినప్పుడే రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తారని తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత దళిత, ప్రజాసంఘాల నాయకులపై ఉందన్నారు. ఆ దిశగా తాను కృషి చేస్తానని తెలిపారు.

అంబేద్కర్ స్ఫూర్తి దాత

- ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నాగరాజ్

ప్రజాశక్తి - ఆదోని

స్వాతంత్ర్య భారతదేశానికి అహర్నిశలు శ్రమించి రాజ్యాంగాన్ని రచించి భవిష్యత్తు తరాలకు బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిదాతగా నిలిచారని ఆమ్ ఆద్మీ పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.నాగరాజ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు మహిళలు, అగ్రవర్ణంలోని పేదలకు రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కలిగే విధంగా రాజ్యాంగంలో పొందుపరచారని తెలిపారు. వాటిని సమగ్రంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అంబేద్కర్ అందరివాడని, అవగాహన లోపంతో కొందరు విమర్శలు చేయడం భావ్యం కాదని తెలిపారు. అంబేద్కర్ జయంత్యుత్సవాలను ప్రభుత్వం వైభవంగా నిర్వహించాలని

విగ్రహానికి మెరుగులు దిద్దుతున్న అధికారులు

అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు

- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో బాబా సాహెబ్ అంబేద్కర్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి గురువారం తెలిపారు. శ్రీనివాస భవన్ ముందు ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మెరుగులు దిద్ది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచామని చెప్పారు. కమిషనర్ చొరవ పట్ల దళిత, ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు టాక్స్ కౌంటర్ పనిచేస్తుంది : ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపు వల్ల వడ్డీ రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా సెలవు అయినప్పటికీ వినియోగదారుల సౌకర్యార్థం క్యాష్ కౌంటర్ పనిచేస్తుందన్నారు. ఈ సదుపాయాన్ని ట్యాక్స్ చెల్లింపు దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోకేష్ పాదయాత్రలో కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు టిడిపి ఉమ్మడి కర్నూలు జిల్లా మహిళా నాయకులు గురువారం ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి ఆదోని మాజీ ఇన్‌ఛార్జీ గుడిసి కృష్ణమ్మ హాజరై స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలం డి.రంగాపురం గ్రామంలో ఉదయం యువగళం పాదయాత్ర ప్రవేశించిందని తెలిపారు. లోకేష్ బృందానికి పూల వర్షం కురిపించి ముందుకు నడిచామన్నారు. టిడిపి ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకులు, మహిళా నాయకులు కోట్ల సుజాతమ్మ, భూమా అఖిలప్రియ, గౌరు చరిత ఉన్నారని తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో జరిగే లోకేష్ పాదయాత్రను సమిష్టిగా జయప్రదం చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు.

గోసంరక్షణ శాలకు రూ.లక్ష విరాళం

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న గో సంరక్షణ శాలకు కర్ణాటకకు చెందిన భక్తులు రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరుకు చెందిన అద్వైత అనే భక్తురాలు గురువారం మంత్రాలయం వచ్చారని పేర్కొన్నారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించినట్లు చెప్పారు. అనంతరం శ్రీమఠం నిర్వహణలో ఉన్న గో సంరక్షణ శాలకు రూ.లక్ష విరాళం ఇచ్చారని తెలిపారు. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుదేంద్రతీర్థులు ఆశీస్సులు అందించారని పేర్కొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..!

- పరిశుభ్రతను మరిచిన అధికారులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

జాలమంచి గ్రామంలో పేరుకుపోయిన మురుగు

పరిసరాలు బాగుంటేనే ఎలాంటి రోగాలూ దరిచేరకుండా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారు. ఇందుకు అధికారులతో పాటు ప్రజలు పరస్పరం సహకరించుకుని స్వచ్ఛతకు నడుంబిగించాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అధికారులు తమవంతుగా ఎప్పటికప్పుడు మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయించడంతో పాటు చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించారు. అందుకు విరుద్ధంగా జాలమంచి గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా తయారయింది. తిమ్మప్ప గుడి ప్రాంతం, పైకొట్టాల, ఎస్సీ, బీసీ కాలనీలో ప్రధాన రోడ్డుపై నడవాలంటే ముక్కు మూసుకోవాల్సిందేనని, గత ఆరు నెలలుగా పంచాయతీ అధికారి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయ కార్యదర్శి లావణ్యకు, గడపగడపకు వచ్చిన ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి మొరపెట్టుకున్నా పారిశుధ్య పనులు మాత్రం చేపట్టడం లేదని గ్రామస్తులు తెలిపారు. మురుగునీరు రోడ్డుపై ప్రవహించి దుర్వాసన వెదజల్లుతోందని, రోగాల బారిన పడాల్సిన వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. లేకపోతే ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి రంగ లక్ష్మి

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రజల దాహార్తిని తీర్చేందుకే పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచి రంగ లక్ష్మి, కార్యదర్శి అబ్దుల్ రహీం తెలిపారు. గురువారం దేవనకొండ పంచాయతీ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వివిధ గ్రామాల నుంచి వ్యక్తిగత పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం తాగునీటి వసతి కల్పనకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పంచాయతీ సిబ్బంది ఇనాయతుల్లా, వార్డు మెంబర్ గోవిందు, గ్రామస్తులు చాంద్ బాష పాల్గొన్నారు.

పైపు లైన్ ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని బాపులదొడ్డి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటి కోసం పైపు లైన్ వేసేందుకు గురువారం భూమి పూజ చేశారు. సర్పంచి చిన్న మహాదేవ, రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ ఫెసిలిటేటర్ భీమేష్ పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పైపులైన్ పనులను ప్రారంభించారు. తాగునీటి పైపులైన్ పూర్తిగా దెబ్బ తినడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడేవారని తెలిపారు. సమస్య తెలుసుకొని తాగునీటి సమస్య పరిష్కారం కోసం స్పందించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డికి, రిలయన్స్ ఫౌండేషన్ వారికి బాపులదొడ్డి సర్పంచి, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపిటిసి మహాదేవ, మాజీ సర్పంచి అయ్యప్ప, నర్సారెడ్డి, నరసింహులు, తిక్కయ్య, మహాదేవ్ పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న నాయకులు

మతోన్మాద బిజెపిని ఇంటికి సాగనంపుదాం...

దేశాన్ని కాపాడుకుందాం...
- సిపిఎం, సిపిఐ ప్రచారభేరిని జయప్రదం చేద్దాం
- సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి పౌరుడూ గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని, ప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని ఇంటికి సాగనంపి, దేశాన్ని కాపాడుకోవాలని నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం ముందు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు హనుమంతు, రాముడు, సిపిఐ నాయకులు పంపన గౌడు, జి.రంగన్న మాట్లాడారు. ఈనెల 14 నుంచి 30 వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జరిగే ప్రచార భేరిని జయప్రదం చేయాలని కోరారు. మోడీ, అమిత్ షాల నాయకత్వంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చు రాజేస్తోందని విమర్శించారు. మరోవైపు అదాని, అంబాని లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతోందని తెలిపారు. బిజెపి నిరంకుశ విధానాలను ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా అణచివేస్తోందన్నారు. దేశంలోని అడవులను, భూములను, విద్యుత్ ప్రాజెక్టులను, గనులను కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెడుతోందని విమర్శించారు. సిపిఐ నాయకులు చిన్నన్న, బజారి, సత్తన్న, సమీవుల్లా, రాజీవ్, తిమ్మగురుడు, ఖాజా, మల్లికార్జున గౌడ్, హనుమంతు, దాదావలీ, విజయ్, రవి, నరసింహులు, సుంకన్న, శ్రీను, ఖాదర్, ఖాసీం, రహీమ్, లచ్చప్ప, సిపిఎం నాయకులు అబ్దుల్లా, ఆంథోని, రాజు, రమేష్ పాల్గొన్నారు. **ఆలూరు** గెస్ట్ హౌస్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి షాకీర్, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 14 నుంచి 30 వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజకీయ ప్రచార భేరిని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం హాలహర్వి మండల కార్యదర్శి కృష్ణ, రైతు సంఘం నాయకులు హోతూరప్ప, ఎఐటియుసి మండల కార్యదర్శి శివ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మునిస్వామి, ఎఐవైఎఫ్ నాయకులు రంగన్న, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా పాల్గొన్నారు.

ఆలూరులో గోడ పత్రికలను విడుదల చేస్తున్న వామపక్ష నాయకులు

కర్ణాటక మద్యం పట్టివేత

కౌతాళం : కౌతాళం పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మేళిగనూరు, నదీచాగి గ్రామాల మధ్య మద్యం పట్టుకున్నట్లు చెప్పారు. కోసిగి మండలానికి చెందిన మహబూబ్ బాషా, అలీ మోటార్ సైకిల్‌పై కర్ణాటక మద్యం పది బాక్సులు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మహబూబ్ బాషా పట్టుబడగా అలీ పరారీ అయినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ తరలించినట్లు తెలిపారు. పోలీసులు రామచంద్ర, నరేంద్ర, రంగన్న పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడదాం

- యుటిఎఫ్ నాయకులు

ఆదోని : లౌకిక భారతదేశంలో మతసామరస్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని యుటిఎఫ్ పట్టణ కమిటీ సీనియర్ నాయకులు సునీల్ రాజ్ కుమార్, గిరిబాబు తెలిపారు. గురువారం రాత్రి యుటిఎఫ్ కార్యాలయంలో ముస్లిం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు సునీల్ రాజ్ కుమార్, గిరిబాబు, మల్లికార్జున మాట్లాడారు. దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అన్ని మతాలు సమానమేనని అందరూ బాగుండాలని ప్రార్థిస్తారని తెలిపారు. ఫయాజుద్దీన్, నూరు బాషా, రెహమాన్, అమానుల్లా, నజీర్ అహ్మద్, ఆయుబ్, జియావుద్దీన్, రూహుల్ అమీన్, జహంగీర్, ఇమ్రాన్, సాధిక్ హుస్సేన్, దస్తగిరి పాల్గొన్నారు.

అర్హుల ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటం

- ఎపి వ్యకాస నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

అర్హులైన పేదలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎర్రజెండాలు పాతారు. మండలంలోని కుంకనూరు గ్రామ రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూమి అయిన సర్వే నెంబర్ 591, 592లో సిపిఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అర్హులైన పేదలతో కలిసి ఎర్రజెండాలు పాతి భూ ఆక్రమణ పోరాటం చేశారు. గురువారం సిపిఐ, ఎపి వ్యకాస ఆధ్వర్యంలో కుంకనూరు క్రాస్ రోడ్డు టర్నింగ్ పరిసర ప్రాంతంలో సర్వే నెంబర్ 591, 592లో గల ప్రభుత్వ పోరంబోకు భూమిలో అర్హులైన పేదలు ఎర్రజెండాలు పాతి స్థలాలు ఆక్రమించుకున్నారు. ఈ సందర్భంగా ఎపి వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నబిరసూల్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, సిపిఐ మండల కార్యదర్శి ఎమ్.నరసరావు మాట్లాడారు. ఇల్లు, ఇళ్ల స్థలాలు లేని అర్హులైన నిరుపేదలకు స్థలాలు కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాల్సిన కనీస బాధ్యత మరచిన పాలక ప్రభుత్వాలపై పోరాటం దిశగా ఈ భూ ఆక్రమణ పోరాటం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమిని సాగు చేస్తున్న పేదలకు డి పట్టాలు మంజూరు చేసి పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. కుంకనూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములను పేదలకు, అర్హులకే సర్వహక్కులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు నెట్టేకల్, వెంకటేశ్వర్లు, శేఖర్, దస్తగిరి, గోపాల్, రమేష్, వెంకటేష్, నాగరాజు, జనార్ధన్, మహేష్, గంగన్న, రంగన్న పాల్గొన్నారు.

జెండాలు పాతుతున్న నాయకులు

నిరసన తెలుపుతున్న నాయకులు

ఆస్పత్రిలోని సమస్యలు పరిష్కరించాలి : జనసేన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు ఎం.తాహెర్ వలీ, పులి రాజు, రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒపి జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది కొరతను తీర్చాలని కోరారు. ఆర్ఒ మినరల్ ప్లాంట్‌ను వినియోగంలో తేవాలని, శానిటేషన్ సిబ్బంది కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ కార్మికులకు రూ.18 వేలు వేతనం చెల్లించాలని, రోగుల సహాయకులు, బంధువులు భోజనాలు చేసేందుకు ప్రత్యేక షెడ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రకాష్, నరసింహులు, ఉరుకుంద, అయ్యప్ప, వీరేష్, మహేంద్ర, ఉదయ్ కుమార్, జయరాజ్, నరసన్న, ఈరన్న, రామిరెడ్డి పాల్గొన్నారు.

విజ్ఞానజ్యోతి అంబేద్కర్

- ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు శివనాగమ్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విజ్ఞాన జ్యోతి అని సంతేకుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు శివనాగమ్మ తెలిపారు. గురువారం పాఠశాలలో బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. బిటిఎ జిల్లా అధ్యక్షులు జి.భాస్కర్ మాట్లాడారు. ఉషారాణి, సుజాతరాణి, సుభాషిణి, దానమ్మ, ఉపాధ్యాయులు రవి, మధు, మల్లికార్జున, మహబూబ్ బాష, మద్దిలేటి, మాబుహుస్సేన్ పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.423/2017

జి.బద్రీనాథ్. ...వాది

-వర్సెస్-

యం.చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ యం.సి.యస్.రెడ్డి. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

యం. చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ యం.సి.యస్.రెడ్డి తండ్రి శంకర్‌రెడ్డి, క్యాషియర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇంటి నెం.401, క్రిష్ణకాంత్‌ప్రైడ్, గణేష్‌నగర్, ఫేస్-2, కర్నూలు.

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 85,500/-లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 28-6-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 28-6-2023

యల్.విశ్వనాథమ్,
వాది పరం న్యాయవాది,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.పి.నెం.39/2022

బి.నససింహులు.
...అర్జీదారు

-వర్సెస్-

యం.యల్.రామచంద్ర మరియు వగైరా. ...రెస్పాండెంట్లు

1,2 వ రెస్పాండెంటుకు నోటీసు

1. యం.యల్.రామచంద్ర, ఇంటి.నెం.17/169జి, యస్.ఆర్.నగర్, పత్తికొండ గ్రామము, కర్నూలు జిల్లా.
2. యం.యల్.పెద్దక్రిష్ణ ఇంటి.నెం.45/27-యఫ్2, ఉయ్యాలవాడ గ్రామ పంచాయతి, నన్నూరు గ్రామం, ఓర్వకల్ (మం), కర్నూలు జిల్లా.

పై నెంబరులో ఐ.పిలో అర్జీదారు బి.నససింహులు తండ్రి బి.రాముడు, ఇంటి.నెం. 3-25, ఉప్పలపాడు గ్రామము, ఓర్వకల్ (మం), కర్నూలు జిల్లా. అను నతడు తనను దావాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో ఐ.పి అర్జీ దాఖలు చేసినది. ఇందుపైన 1,2 వ రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 25-04-2023వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీపరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందుమూల ముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 25-4-2023

యస్. క్రిష్ణ,
సి. క్రిష్ణారెడ్డి,
అర్జీదారు తరుపు న్యాయవాదులు, కర్నూలు.

'యువగళం'కు ఘన స్వాగతం

- జిల్లాలోకి ప్రవేశించిన లోకేష్ పాదయాత్ర

నారా లోకేష్ యువగళం పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న జిల్లా నేతలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/ప్యాపిలి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలోకి గురువారం ప్రవేశించింది. డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలం డి.రంగాపురం వద్ద లోకేష్‌కు టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో డోన్ ఇంచార్జ్ సుబ్బారెడ్డి, బిసి జనార్ధన్ రెడ్డి, కెఇ శ్యాంబాబు, గౌరు వెంకట రెడ్డి, గౌరు చరితా రెడ్డి, భూమా అఖిల ప్రియ, కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ, మీనాక్షి నాయుడు, తిక్కా రెడ్డి, కెఇ ప్రభాకర్, ఎన్ఎండి ఫరూక్, బిటి నాయుడు, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఏరాసు ప్రతాపరెడ్డి, బివి జయ నాగేశ్వర్ రెడ్డి, శివానంద రెడ్డి, టిజీ భరత్, భూమా బ్రహ్మానంద రెడ్డి, ఎవి సుబ్బారెడ్డి, బిసి సాధికారత ఛైర్మన్ నాగేశ్వర్ రావు యాదవ్, మురళికృష్ణ గౌడ్, వలసల రామకృష్ణ, సుబ్బయ్య, రాంమోహన్, సుంకయ్య, ఖాజా పీర్, సుదర్శన్, రామాంజినేయులు, నాగేంద్ర, మల్లి, అభి, అనుదీప్ ఉన్నారు. అక్కడి నుండి జక్కసానికుంట్ల వద్ద ఎస్సీ సామాజికవర్గ ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించారు. టిడిపి అధికారంలోకి రాగానే దళితవాడలకు శ్మశానానికి స్థలాలు కేటాయిస్తామని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చాక వైసిపి ప్రభుత్వం దళితులపై పెట్టిన అక్రమ కేసులు రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. సబ్సిడీ లోన్లను రీ షెడ్యూల్ చేసి లబ్ధిదారులను ఆదుకుంటామని తెలిపారు.

నేడు యాత్ర సాగనుంది ఇలా...

7.00 - గుడిపాడు క్యాంప్ సైట్ నుంచి పాదయాత్ర ప్రారంభం.
7.10 - గుడిపాడులో స్థానికులతో మాటామంతీ.
8.30 - హెచ్ఆర్ పల్లిలో యాదవులతో సమావేశం.
9.25 - పూదొడ్డి, మందొడ్డి క్రాస్ వద్ద మామిడి రైతులతో భేటీ.
11.00 - ప్యాపిలి శివార్లలో భోజన విరామం.
4.00 - ప్యాపిలి శివార్ల పాదయాత్ర కొనసాగింపు.
4.45 - ప్యాపిలి నీలకంఠేశ్వరస్వామి గుడివద్ద స్థానికులతో సమావేశం.
4.55 - ప్యాపిలి బిసి కాలనీలో 900 కి.మీ. మైలురాయి చేరిక, శిలాఫలకం ఆవిష్కరణ.
5.30 - ప్యాపిలిలో బహిరంగ సభ.
7.30 - పొలిమేరమెట్ట విడిది కేంద్రంలో బస.

చెరువుకుంట మరమ్మతులు చేయించాలి

- లోకేష్‌కు విన్నవించిన నల్లమేకలపల్లె గ్రామస్తులు

చెరువుకుంట మరమ్మతులు చేయించి ఆదుకోవాలని నల్లమేకలపల్లె గ్రామ స్తులు లోకేష్‌ను కలిసి విన్నవించారు. అధికారులను కోరినా పట్టించు కోవడం లేదని తెలిపారు. కుంటలో నీళ్లుంటేనే బోర్లకు నీరు పుష్కలంగా అందుతుందని, వ్యవ సాయం బాగుంటుందని వివరించారు. లోకేష్ స్పందిస్తూ తాము అధికారంలోకి వచ్చాక చెరువు కుంటకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయం, పశువులకు నీటి సమస్యలేకుండా చేస్తామన్నారు.

సిసి రోడ్లు లేవు..డ్రైనేజీ సమస్య

- లోకేష్‌కు పిఆర్ పల్లె గ్రామస్తులు మొర

గ్రామంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉందని, ఇళ్ల ముందు మురికినీరు నిల్వ ఉండడం వల్ల అనునిత్యం అనారోగ్యం పాలవుతున్నామని నారా లోకేష్‌ను పిఆర్ పల్లి గ్రామస్తులు కలిసి సమస్యలను విన్నవించారు. కొన్ని వీధుల్లో సిసి రోడ్లు లేవని తెలిపారు. టిడిపి పాలనలో మంజూరైన ఇళ్లకు వైసిపి ప్రభుత్వం బిల్లులు నిలిపేసిందని చెప్పారు. వీటిపై లోకేష్ స్పందిస్తూ అధికారంలోకి వచ్చాక పిఆర్ పల్లిలో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. బిల్లులు ఆపేసిన ఇళ్లకు విడుదల చేస్తామన్నారు. అక్కడి నుండి పాదయాత్ర గుడిపాడుకు చేరు కుంది. ప్రత్యేక శిబిరం వద్ద రాత్రి బస చేశారు. గురువారం మొత్తంగా 15.6 కిలోమీటర్లు యాత్ర సాగింది.

ఎస్‌సి సామాజికవర్గ ప్రజాప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడుతున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

తన భూమి పట్టా తనకు ఇప్పించి న్యాయం చేయాలని నారా లోకేష్‌కు విన్నవిస్తున్న ఎస్‌సి మహిళ

ప్యాపిలి మండలంలో యువగళం పాదయాత్రలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

ప్రశాంతంగా పది పరీక్షలు

- జిల్లాలో కలెక్టర్, డిఇఒ, ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్/బేతంచెర్ల

జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య జరుగుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ తెలిపారు. గురువారం జరిగిన సైన్స్ పరీక్షకు 24,059 విద్యార్థులకు గాను 23,749 విద్యార్థులు హాజరు కాగా, 310 మంది గైర్హాజరయినట్లు తెలిపారు. బేతంచర్ల పట్టణంలోని సెయింట్ ఆన్స్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ 7 పరీక్ష కేంద్రాలను, పరీక్షల విభాగం, సహాయ కమిషనర్ గోపాల్ 4 పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 5 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 32 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు. అలాగే రాష్ట్ర పరిశీలకులు ఆర్.నరసింరావు 7 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం 51 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు డిఇఒ వెల్లడించారు. సమస్యాత్మక కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి సజావుగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బేతంచెర్లలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

మోడీ దుష్ట పాలనపై

నేటి నుండి వామపక్షాల ప్రచార భేరి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద చర్యలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐల ఆధ్వర్యంలో నేటి నుండి ఈ నెల 26వ తేదీ వరకు ప్రచార భేరి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రచార భేరీలో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో చేపడుతున్న దుష్ట పాలనను ఎండ గడుతూ ప్రజల్లో చైతన్యం కల్పించనున్నారు. నరేంద్ర మోడీ అధికారం చేపట్టాక పెట్రోల్, డిజల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడంతో పాటు, ఒకే భాష, ఒకే దేశం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీసి ఫెడరల్ స్ఫూర్తికే విఘాతం కల్పించాలని చూస్తున్న మోడీ నియంతృత్వ విధానాలను ఎండగట్టనున్నారు. దేశ సంపదను మోడీ ఆదానికి కట్టబెడుతున్న నిరంకుశ పాలనను నిరసిస్తూ సిపిఎం, సిపిఐలు నేటి నుంచి ప్రచార బేరితో ప్రజలను జాగృతి చేయబోతున్నారు. నేడు రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాలు దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బొమ్మల సత్రం సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లులర్పిస్తారు. అక్కడ నుండి గాంధీ నగర్ వరకు ర్యాలీగా బయలుదేరి అక్కడ సభ ఏర్పాటు చేసి సిపిఎం, సిపిఐ నాయకులు ప్రసంగిస్తారు.

ప్రచార జాతాను విజయవంతం చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్

ప్రజాశక్తి - పాములపాడు

దేశంలో బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో నేటి నుండి ప్రచార జాతా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ కోరారు. గురువారం పాములపాడులోని సిపిఎం కార్యాలయంలో మండల కార్యదర్శి సామన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో ప్రతిపక్షాల గొంతును నొక్కేందుకు బిజెపి టార్గెట్ చేసి పలు ఇబ్బందులకు గురి చేసేందుకు పూనుకుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని మంటగలిగేందుకు పూనుకున్నదని చెప్పారు. దేశంలో బిజెపికి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటుపరం చేసేందుకు యత్నిస్తుందని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు ఫేస్ యాప్ ఎత్తివేసి, పథకానికి అధిక నిధులు కేటాయించి దినసరి వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించకుండా ఉచిత కరెంటును కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, సీనియర్ నాయకులు బి రామేశ్వరరావు, నాయకులు వెంకటేశ్వరరావు, హనుమంతు, బాలయ్య, ఏసేపు, రవణమ్మ, బాల యేసు, సురేషు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్

పులి పాదముద్రలు గుర్తింపు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలోని రుద్రవరం అటవీ సెక్షన్‌లోని హుస్సేనయ్య దర్గా ప్రాంతంలో పులి పాదముద్రలు గుర్తించినట్లు రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ హుస్సేనయ్య దుర్గా ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు కొందరు రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారన్నారు. దీంతో రుద్రవరం ఫారెస్ట్ సెక్షన్ అధికారి నాగరాజు, బీటు అధికారులు సురేంద్ర గౌడ్, నరసింహారెడ్డిని ఆ ప్రాంతానికి పంపి పులి పాద ముద్రలను గుర్తించినట్లు చెప్పారు. చలమ అటవీ రేంజ్ ప్రాంతం నుంచి పులి ఈ ప్రాంతానికి వచ్చిందని, తిరిగి అదే ప్రాంతానికి వెళ్లినట్లు పాద ముద్రల ద్వారా తెలిసిందన్నారు. రైతులు పంట పొలాల్లో పనులు చేసుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా పులి కనిపిస్తే ఎటువంటి హాని తలపెట్టకుండా సమాచారాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

రంజాన్ వేళలు

శుక్రవారం
ఇఫ్తార్ : 6 : 38

శనివారం
సహేరి : 4 : 39

మాట్లాడుతున్న చలమరేంజ్ అధికారి ఈశ్వరయ్య

అడవులకు నిప్పు పెట్టవద్దు

- చలమ రేంజ్ అధికారి ఈశ్వరయ్య

ప్రజాశక్తి - రుద్రవరం

చలమ రేంజ్ పరిధిలోని నల్లమల అడవుల్లో సంచరించే వన్యప్రాణులకు హాని తలపెట్టవద్దని, అడవులకు నిప్పు పెట్టరాదని చలమరేంజ్ అధికారి ఈశ్వరయ్య తెలిపారు. గురువారం నంద్యాలలోని చలమ ఫారెస్ట్ కార్యాలయంలో రుద్రవరం మండలంలోని శ్రీరంగాపురం, డి.కొట్టాల, మహానంది మండలంలోని గాజులపల్లి, గ్రామాల రైతులకు అడవుల సంరక్షణ, వన్యప్రాణులను ఎలా కాపాడుకోవాలి, అడవులకు నిప్పు పెట్టడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం నల్లమల అడవుల్లో వేసవి కారణంగా వన్య ప్రాణులకు నీరు దొరకక సమీపంలో రైతులు పంట పొలాలకు ఉపయోగించే నీటి కోసం వస్తుంటాయన్నారు. రైతులు అలా వచ్చే జంతువులకు ఉచ్చులు వేయడం, వేటాడం లాంటివి చేయరాదన్నారు. రైతులు, బాటసారులు అటవీ ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ నిప్పు వేయరాదని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద కంబలూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్ ఎల్లమ్మ, బీట్ ఆఫీసర్లు నాగప్ప, రామేశ్వరి పలువురు రైతులు పాల్గొన్నారు.

నేటి నుండి అగ్నిమాపక వారోత్సవాలు

మాట్లాడుతున్న అధికారి వీరా రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని అగ్ని మాపక దళ కేంద్రం పరిధిలో నేటి నుండి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వీరారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆకస్మికంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టవలసిన చర్యలపై తమ సిబ్బంది అవగాహన నిర్వహిస్తారన్నారు. వారం రోజులపాటు వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

భవిష్యత్తులో జరిగే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. గురువారం రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పాల్గొన్నారు. మార్పులు, చేర్పులకు సంబంధించిన పెండింగ్ ఆక్షేపణలు, ఓటర్ గుర్తింపు కార్డుల ప్రింటింగ్, ఎపిక్ కార్డుల పంపిణీ, ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఓటర్లను సుమోటోగా తొలగించకుండా క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదుకు, చేర్పులు, మార్పులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి విచారణ జరిపి ఓటర్ల జాబితాలో చేర్చాలన్నారు. ఈఆర్ఓ నెట్ ఈ నెల 17 నుండి అందుబాటులోకి వస్తుందన్నారు. పెండింగ్‌లో వున్న క్లైమ్స్, అబ్జెక్షన్స్‌పై దృష్టి సారించి పరిష్కరించే దిశలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలెక్టోరల్ రోల్, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, ఈవిఎం, ప్లానింగ్, పోలింగ్ సిబ్బంది, లా అండ్ ఆర్డర్, ఎలక్షన్ వ్యయం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ తదితర అంశాలపై పటిష్ఠ ప్రణాళిక రూపొందించుకొని ఆ మేరకు నోడల్ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం ఏర్పాటుపై జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫాం 6, 7, 8లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 3940 దరఖాస్తులను త్వరితగతిన విచారించి ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు, ఎన్నికల సూపరింటెండెంట్ శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

హద్దు రాళ్లు పాతండి

- రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నిర్ణీత కాల పరిమితిలోగా హద్దురాళ్ల ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర భూ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. గురువారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి రాష్ట్రంలో జరుగుతున్న రీసర్వే ప్రగతిపై ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మొదటి దశలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో వెబ్ ల్యాండ్ ప్రగతి, పాస్ పుస్తకాలు ప్రింటింగ్, హద్దురాళ్ళు పాతడం, జిసిపి మార్కింగ్, చెకింగ్ పాయింట్స్ గుర్తింపు, డ్రోన్ ఫ్లయింగ్, గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసుల పంపిణీ, సెక్షన్ (13)నోటిఫికేషన్ల ప్రగతి తదితర అంశాలపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ మాట్లాడుతూ జిల్లాల్లో చేపడుతున్న రీసర్వే, హద్దురాళ్ల ప్లాంటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫేజ్-2 కింద చేపట్టిన రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులు మరింత వేగవంతం కావాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్‌కు అవసరమైన అదనపు రోవర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించినప్పటికీ పనుల్లో జాప్యం జరుగుతోందని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు, ల్యాండ్ అండ్ సర్వే ఏడి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్

శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలోని దేవనగర్, విసి కాలనీ, ఉప్పర పేట ప్రాంతాలలోని మజీదుల్లో మైనార్టీ సోదరులకు గురువారం శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. రోజాదారులతో కలిసి భోజనం చేశారు.

ఐఎంఎ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నంద్యాల : రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ జఫరుల్లా, డాక్టర్ షబ్నం దంపతుల నిర్వహణలో వైద్య బృదం బాబన్, అహ్మద్ హుస్సేన్, మహమ్మద్ రఫీ, జహంగీర్ బాషా, మహబూబ్ బాషా, హాషం, మహమ్మద్, సోహెల్ ఖలీల్, అరిఫా భాను, షర్మిల, చరిస్మా, జాస్మిన్, ఫాతిమా, సలిమున్నీసా, షబ్బీర్, రుహుల్లా, షా ఆలం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పట్టణంలోని వైద్యుల కుటుంబాలతో సహా అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రముఖ వైద్యులు సహదేవుడు, మధుసూదన రావు, మధుసూదన రెడ్డి, విజయభాస్కర రెడ్డి, అనిల్ కుమార్, చంద్రశేఖర్, పనిల్ కుమార్, వినోద్, హరినాథ్ రెడ్డి, వసుధ నాగమణి, నర్మదా, మాధవి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ముస్లిముకు ఖర్జూర తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేయిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షల్లో

ఒకరి బదులు మరొకరు..

- పట్టుబడిన వ్యక్తి.. - కేసు నమోదు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా ఆత్మకూరులో గురువారం జరిగిన ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీల్లో అభ్యర్థి బదులు మరొకరు పరీక్ష రాస్తుండగా స్క్వాడ్ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. నంద్యాల జిల్లాలో గురువారం జరిగిన ఓపెన్ స్కూల్ పరీక్షలకు పదవ తరగతి 6 పరీక్షా కేంద్రాలలో 967 మంది విద్యార్థులకు గాను 872 హాజరయ్యారు. 95 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ ఇంటర్ 8 కేంద్రాలలో 645 మంది విద్యార్థులకు గాను 583 విద్యార్థులు హాజరయ్యారు. 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆత్మకూరులోని ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ సెంటర్‌లో ఒకరి బదులు మరొకరు పరీక్ష రాస్తుండగా స్క్వాడ్ పట్టుకొని కేసు బుక్ చేశారు.. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ 2 పరీక్ష కేంద్రాలను, 6 ఫ్లయింగ్ స్క్వాడ్లు 14 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

తాగునీటి సమస్య తలెత్తరాదు

- మునిసిపల్ ఛైర్మన్ షేక్ మాబున్నిసా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని ఆయా వార్డులలో డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని మునిసిపల్ ఛైర్మన్ షేక్ మాబున్నీ సా సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక 27వ వార్డులోని దేవనగర్-2లో ఆమె మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించారు. స్థానిక, మంచినీటి సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగు నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ డిఈ శ్రీనివాస రెడ్డి, హెల్త్ ఆఫీసర్ అంకి రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్, వార్డు కౌన్సిలర్, వార్డు ఇంచార్జీ, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణపై అవగాహన

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆలమూరు రైతు భరోసా కేంద్రంలో మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్ర ఇన్చార్జిలకు మట్టి నమూనాలు సేకరించే విధానం, పరీక్షించే విధానంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ ముఖ్యంగా ప్రధాన పోషకాలు అయిన నత్రజని, భాస్వరం, పొటాష్, ద్వితీయ పోషకాలైన కాల్షియం, సల్ఫర్, మెగ్నీషియం, సూక్ష్మధాతువులైన జింక్, బోరాన్, మాంగనీస్ ఐరన్, మాంగనీస్ కాపర్, మాల్విడినం క్లోరిన్, మొదలైన వాటి ఆవశ్యకతపైన అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఖరీఫ్ నుండి ప్రతి రైతు భరోసా కేంద్ర పరిధిలో మట్టి పరీక్షలకు నమూనాలను సేకరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి నరేష్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎంపీఈవోలు, రైతు భరోసా కేంద్రం ఇన్చార్జిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

గద్దెనెక్కిన తర్వాత పాఠశాలల అభివృద్ధి గుర్తురాలేదా

ప్రజాశక్తి - పగిడ్యాల

ఎన్నికల ముందు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్ది విద్యను అభివృద్ధి చేస్తానని చెప్పిన వైయస్ జగన్మోహన్ రెడ్డి గద్దెనెక్కిన తర్వాత పాఠశాలల అభివృద్ధిని మరిచారని పిడిఎస్‌యు డివిజన్ కార్యదర్శి మద్రి స్వామి, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కుమార్ మండిపడ్డారు. గురువారం మండల కేంద్రం పగిడ్యాలలోని కస్తూరిబా పాఠశాల, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, మోడల్ స్కూల్‌లను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాడు-నేడు పథకం కింద పాఠశాలలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కస్తూరిబా పాఠశాలలో అభివృద్ధి కోసం నిధులు మంజూరై సంవత్సరం కావస్తున్న ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. నాడు-నేడు పథకంతో పాఠశాలలను రూపుమాపుతా మని చెప్పిన వైయస్సార్ ప్రభుత్వం ఇంతవరకు అటువైపు అడుగులేసిందే లేదన్నారు. నాడు నేడు కింద పాఠశాల గదులు నిర్మాణంలో నాణ్యతలో అలోపించడంతోపాటు పనులు నత్త నరకంగా నడుస్తున్నాయని వారు ఆరోపించారు. ఇప్పటికైనా పాఠశాలల అభివృద్ధి కోసం నాడు నేడు పథకం కింద మంజూరైన నిధులతో పాఠశాలల అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని లేనియెడల పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడతామని వారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు డివిజన్ ఉపాధ్యక్షులు ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు వరుణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి

పక్షులకూ వేసవి దాహం తీరుద్దాం

ప్రజాశక్తి - బనగానపల్లె

వేసవికాలంలో పక్షులకు, పశువులకు దహాన్ని తీర్చాలని జెకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద చారి పేర్కొన్నారు. మండలంలోని చెరువు పల్లె ఉర్దూ పాఠశాల యందు జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మాందచారి ఆధ్వర్యంలో పొద్దుటూరు పట్టణానికి చెందిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తి సహకారంతో చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పక్షులకు, జంతువులకు వేసవి దాహం తీరుద్దాం, వేసవిలో విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాందచారి మాట్లాడుతూ వేసవికాలంలో పక్షులకు, జంతువులకు తాగడానికి నీరు దొరకక ఇబ్బందులు పడుతున్నాయని, మూగజీవుల దాహం తీర్చడం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారం అవుతామని అన్నారు. జంతువుల, పక్షుల దాహార్తిని తీర్చడానికి అందరూ సమిష్టి కృషి చేయాలని కోరారు. పక్షులు, జంతువులు తిరిగే ప్రదేశంలో నీళ్ల తొట్లు, వాటర్ బాల్స్ ఏర్పాటు చేయాలని బ్రహ్మానంద చారి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంఎస్ అబ్దుల్ రహీం, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండలంలోని బసాపురం సర్పంచి లక్కాకుల చంద్ర, వైసిపి నాయకులు అబ్దుల్ సలాం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని గురువారం ఆళ్లగడ్డలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిపై ఎమ్మెల్యేతో వారు చర్చించారు. శిరివెళ్ల ఎస్సి కాలనీ ప్రధాన రహదారికి సర్పంచి లక్కాకుల చంద్ర, అబ్దుల్ సలాం అధ్వర్యంలో ఎమ్మెల్యే ఆదేశాలతో ఎట్టకేలకు మొక్షం లభించింది. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసిన రహదారికి మిగిలిన రహదారిని సైతం పూర్తి చేయాలని ఎమ్మెల్యేను వారు కోరారు. రోడ్డు నిర్మాణం ఎమ్మెల్యే గంగుల సహకారంతో త్వరలో పూర్తి చేస్తామని సర్పంచి తెలిపారు.

రంజాన్ పవిత్రమైన మాసం

- కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

రంజాన్ మాసం పవిత్రమైనదనిఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల్ రెడ్డి అన్నారు. గురువారం కొండపేటలోని ఎక్ కమాన్, మసీదులో వైసిపి నాయకుడు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ముస్లిములకు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా కాటసాని ఓబుల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన కిషోర్ బాబు పది సంవత్సరాలు నుండి ఈ మసీద్‌లో ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషమన్నారు. కార్యక్రమంలో సైకిల్ షాప్ మహబూబ్ అలీ, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్ అబ్దుల్ ఫైజ్, అత్తర్ జావేద్, సుదర్శన్ రెడ్డి , ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

గడపగడపకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్రెడ్డి, ఉపాధ్యక్షులు ఆశీర్వాదమ్మ, ఎంపిటీసీ సభ్యుడు పత్తినారాయణ, లక్ష్మిరెడ్డి, నరసింహులు, సర్పంచి మహేశ్వరి,సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, నాయకులు శ్రీనివా సులరెడ్డి, వెంకట రామిరెడ్డి, కిరణ్,బాబు, భాస్కర్రెడ్డి, వెంకటయ్య, నరసిం హుడు, జగదీశ్వర్ రెడ్డి,వెంకట సుబ్బారెడ్డి, రామగుర్విరెడ్డి,తహసిల్దార్ విజయ్ కుమార్,ఎంపిడీఓ భాగ్యలక్ష్మి,ఎంఈఓ అనురాధ, ఏఈలు జగ్గయ్య, షఫివుల్లా షాజహాన్,ఏఓ రంగనేతాజి, ఈఓఆర్డి నాగేంద్రయ్య,ఏపిఓ నిర్మల,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి

యర్రగుడిలో.. మా నమ్మకం నువ్వే జగన్

కొలిమిగుండ్ల : మండలంలోని యర్రగుడి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బి.ఉప్పలూరు సచివాలయ కన్వీనర్ యాపర్ల.వెంకటేశ్వర రెడ్డి, గ్రామ సర్పంచ్ కంబగిరిస్వామి, ఎంపిటిసి పోలు.క్రిష్ణయ్య, నిమ్మకాయల రంగయ్య, రాంమోహన్ దస్తగిరి, గృహసారథులు పాల్గొన్నారు.

యర్రగుడిలో..

ప్రతి కుటుంబానికి పథకాలు

- ఆత్మకూరు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్

ఆత్మకూర్: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆత్మకూరు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో జగనే మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి సిఎం జగన్ స్టిక్కర్లను గృహ సారథులు, కన్వీనర్లు, వార్డు కౌన్సిలర్లు అతికించారు. ఈ సందర్భంగా ఎంఏ రషీద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ముర్తు జాబీ కలిముల్లా, మోమిన్ వహీద్, శాలి, ఫైల్ మాన్, కుతూష్, కన్వీనర్లు చంద్రచ ముర్తుజావలి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అనువైన పంటల సాగు

మట్టిని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆళ్లగడ్డలో..

ప్రజాశక్తి - కొత్తపల్లి

మట్టి పరీక్ష ఆధారంగా భూముల పోషకాల నిల్వ శాతం తెలుసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత, ఎంపీడీవో మేరీ రైతులకు సూచించారు. గురువారం కొత్తపల్లి వ్యవసాయ అధికారి మహేష్ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రం సిబ్బందికి మట్టి నమూనా సేకరణపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి పరీక్ష ఆధారంగానే భూముల పోషకాల నిల్వ శాతము, నేల ఆరోగ్య స్థితి తెలుసుకోవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఉన్న ప్రతి రైతు మట్టి పరీక్ష చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని రైతు భరోసా కేంద్ర సిబ్బందికి సూచించారు. ఏఈఓ వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : గ్రామాల్లో ఉన్న ప్రతి రైతు మట్టి పరీక్ష చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని ఏవో కిషోర్ రెడ్డి సూచించారు. గురువారం ఓబులంపల్లి రైతు భరోసా కేంద్రంలో రైతు భరోసా కేంద్రం సిబ్బందికి మట్టి నమూనాలు సేకరించే విధానం, వాటిని పరీక్షించే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మట్టి పరీక్ష ఆధారంగానే భూముల పోషకాల నిల్వ శాతం తెలుసుకోవచ్చని తెలిపారు. మట్టి నమూనా ఏ విధంగా తీయాలి మరియు మట్టి నమూనాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మట్టి పరీక్ష చేసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎంపీఈవోలు, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి : గ్రామాల్లో రైతులు భూమి సారవంతంగా ఉందా లేదా ఏదైనా లోపం ఉందా అన్న విషయాన్ని భూసార పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చని, భూసార పరీక్షల ఆధారంగా తెలుస్తుందని వ్యవసాయ అధికారి రంగనేతాజి తెలియజేశారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో భూసార పరీక్ష శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు, వ్యవసాయ సిబ్బందికి సలహాలూ సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది, వీఏఏలు పాల్గొన్నారు.

చాగలమర్రి : భూసార పరీక్షలపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని 40వ నెంబర్ జాతీయ రహదారిపై ఎస్ఆర్‌బిసి ప్రధాన కాలువ వంతెన వద్ద కారు ట్రాక్టర్‌ను ఢీకొని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వివరాల మేరకు.. గురువారం తెల్లవారుజామున 5 గంటలకు హైదరాబాద్ నుండి తిరుపతి వెళుతున్న కారు ముందుగా వెళు న్న ట్రాక్టర్‌ను అతివేగంతో ఢీకొంది. దీంతో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఎడమవైపున కారు యజమాని బాలరాజు (36) అక్కడికక్కడే మృతి చెందాడు. వేగం దాటికి ట్రాక్టర్ ట్రాలీ తిరిగి పడి కారు డివైడర్‌పైకి చేరింది. కారు డ్రైవరు నిజాంపురం వినీత్‌ను, కారులో ఉన్న సుద్ద గొని ప్రేమ్, గొల్లపల్లి అభిలాష్, ట్రాక్టర్ డ్రైవర్ మధులను చికిత్స నిమిత్తం శాంతిరాం వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసు కున్న ఎస్ఐ సుధాకర్ రెడ్డి హైవే పెట్రోలింగ్ వాహనము హెడ్ కానిస్టేబుల్, నేషనల్ హైవే టోల్గేట్ సిబ్బంది, సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కారులో నలుగురు మిత్రులు సంగారెడ్డి హైదరాబాదుకు చెందినవారుగా గుర్తించారు. క్రిష్ణగిరి మండలం, గ్రామం నుండి మహానంది మండలం సీతారామ పురంలో వరిగడ్డి కోసం వెళ్తున్న ట్రాక్టర్‌ను కారు బలంగా ఢీకొన్న ది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త నుండి సంపదకు అడుగులు

- ఎర్రగుంట్లలో సర్పంచ్ కృషి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని ఎర్రగుంట్ల గ్రామపంచాయతీ సర్పంచ్ కాలూరి శ్వేత కుమారి, పంచాయతీ కార్యదర్శి యశ్వంత్‌ల ఆధ్వర్యంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్డులో చెత్త నుండి సంపద తయారికి కృషి చేస్తున్నారు. చెత్త నుండి సంపద తయారు చేసి వాటిని అమ్మడం ద్వారా గ్రామపంచాయతీని ఆర్థికంగా బలోపేతం చేయాలని కృషి చేయడం అభినందించదగ్గ విషయమని గ్రామ ప్రజలు చెబుతున్నారు. దీంతో పాటు సర్పంచ్ శ్వేత కుమారి గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం నిరంతరం కషి చేస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో శానిటేషన్, తాగునీరు, ఉపాధి హామీ పనులు కల్పించడం. ఎల్లప్పుడూ గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రజల సహకారంతో పనిచేస్తున్నా రని పలువురు కితాబు ఇస్తున్నారు. ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వకునా తమ సొంత నిధులతో వారికి వేతనాలు ఇస్తున్నారని కార్మికులు పేర్కొంటున్నారు. ఎర్రగుంట్ల గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం గ్రామ పెద్దల సహకారము ప్రజల సహకారంతో నిరంతరం కృషి చేస్తామని సర్పంచి దంపతులు కాలూరి ప్రసాద్, కాలూరి శ్వేత కుమారి తెలిపారు.

ఎరువులు తయారు చేస్తున్న దృశ్యం

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపిడివో సుబ్బరాజు అధికారులకు సూచించారు. గురువారం కొలిమిగుండ్ల ఎంపిడివో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బయోమెట్రిక్ అటెండెన్స్, ఆయుస్మాన్ భారత్ రిజిస్ట్రేషన్‌లు, తాగునీటి సమస్యలు, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి తాహిర్ హుస్సేన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తుమ్మలూరు సర్పంచ్ వనమాల ప్రసాదరావు తెలిపారు. గురువారం మండలంలోని తుమ్మలూరు మజార కృష్ణరావుపేట గ్రామంలో తాగునీటి సమస్య కలుత్తకుండా జెడ్పిటిసి జ్యోతి రామలింగేశ్వర రెడ్డి సహకారంతో బోరు మోటారు మరమ్మతులకు గురి కావడంతో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వనమాల ప్రసాదరావు మాట్లాడుతూ ఈ బోరు నుండి గ్రామానికి అంత పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. దీంతో గ్రామంలో నీటి సమస్య కలుస్తాకుండా ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

బోరుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

డ్రోన్ పైలెట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - బేతంచర్ల

డ్రోన్ పైలెట్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని ఎంపిపి నాగభూషణం రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పూర్వ శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో డ్రోన్స్ ఇన్స్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఏపీ స్కిల్ డేవలప్మెంట్ సంయుక్తంగా డ్రోన్స్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి బుగ్గన నాగ భూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సి. హెచ్.చలం రెడ్డి,వైసీపీ సీనియర్ నాయకుడు బాబుల్ రెడ్డి మాట్లాడుతూ 45 రోజుల పాటు డ్రోన్స్ శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది విద్యార్థులకు నేడు సెంచూరియన్ గ్రామ్ తరంగ్ ఈ క్లూజివ్ డేవలప్మెంట్ సిరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ-విశాఖపట్నం వారు ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపికైన వారికి నెలకు దాదాపుగా రూ.17 వేల వరకు వేతనంతో, ఉచిత వసతులతో ఉద్యోగాలు లభించడం అభినందనీయమన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నత చదువులు చదువుకోలేని విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ ఇంటర్వ్యూల ప్రారంభోత్స వంలో మంత్రి బుగ్గన పర్సనల్ సెక్రెటరీ శ్రీనివాస రెడ్డి, స్కిల్ డేవలప్మెంట్ సుశీల్ కుమార్,డిఎస్డిఓ ప్రతాప్ రెడ్డి, నిర్వహణ సంస్థ అధికారి ఎస్. కిరణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి

మత పెద్దలను ముస్లిం సోదరులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

16న ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - బనగానపల్లె

రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఈ నెల 16వ తేదీన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇఫ్తార్ విందును ఇవ్వనున్నారు. గురువారం పట్టణంలోని లాల్ మజీద్, జంగ్లీమా మజీద్, ఖాజీ వాడ మజీద్, జెండేవాలే సాహెబ్ మజీద్‌లలో పేషిమాం, మౌజన్‌లను కలిసి ఇఫ్తార్ విందుకు రావాలని ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 16న పట్టణంలోని 27 మసీదుల వద్ద ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అత్తార్ జాహీద్ హుస్సేన్, సైకిల్ షాప్ మహబూలి, కూరగాయల రహిమాన్, బబ్లూ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పండ్ల దుకాణం దగ్గర ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్ రమేష్ బాబు

ప్లాస్టిక్ వాడితే జరిమానా

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల పట్టణంలో చిరు వ్యాపారస్తులు దుకాణందారులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను ఉపయోగిస్తే తప్పకుండా జరిమానా విధించి కేసులు బనాయించాల్సి వస్తుందని బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, చిన్న వ్యాపారస్తులను, దుకాణందారులను హెచ్చరించారు. గురువారం పాత బస్టాండు అంగళ్ళ బజారు ప్రాంతాలలో నగర పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయా దుకాణాలను వ్యాపారాలను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భారత్ బేకరీ దగ్గర పండ్ల దుకాణాలు, కూరగాయల, కిరాణం అంగళ్లను తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయా వ్యాపారస్తులకు జరిమానాలు విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిబంధనల ప్రకారం పూర్తిగా నిషేధం జరగాలని అందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ బిల్డింగ్ ప్లానింగ్ ఆఫీసర్ అమ్జాద్ బాష, జాకోబ్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరేందుకు పత్రాలు అందజేస్తున్న ఎంఈవో అనురాధ

విధుల్లోకి 98 బ్యాచ్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలంలో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు గురువారం విధుల్లో చేరారని ఎంఈవో అనురాధ తెలిపారు. మండల వ్యాప్తంగా 1998 డీఎస్సీ 11 మంది అభ్యర్థులు క్వాలిఫై కాగా అందులో 7మంది అర్హత సాధించారన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 7 మంది అభ్యర్థులు వారికి కేటాయించిన పాఠశాలల్లో గురువారం విధుల్లో చేరారు. చాగలమర్రి పట్టణంలో గుంతపాలెం పాఠశాలలో దావుద్,చింతలచెరువు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, పట్టణానికి చెందిన హనీఫ్ జ్ఞానాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - చాగలమర్రి

జిల్లాలో జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆ సమస్యల పరిష్కారానికి అధికారుల దృష్టికి జిల్లా జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని జిల్లా కార్యవర్గ సభ్యులు నాదిండ్ల బాలుడు అన్నారు. గురువారం ఆయన చాగలమర్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా విలేకరుల సంఘం సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జిల్లా జర్నలిస్టు నాయకులకు, సహ పాటి విలేకరులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే స్థలాలను కేటాయించి గృహాలు నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

టార్పాలిల్‌లను పంపిణీ చేస్తున్న ఎంపిపి, తదితరులు

టార్పాలిన్లు పంపిణీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

వేసవికాలంలో మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలకు టార్పలిన్ పట్టాలను బేతంచర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల మండలం ఎంపీడీవో వెంగన్న గురువారం నాడు ఏపీవో శేషన్న ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంగన్న, ఎంపీపీ నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు పని చేసే చోట్ల ఎండ దెబ్బ వడదెబ్బ తగలకుండా ఉండడానికి ప్రభుత్వం నుండి బేతంచెర్ల మండలానికి 120 టార్పాలిన్ పట్టాలు మంజూరు అయినాయని, వీటితో పాటు 20 మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా అందించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గోరుమానుకొండ సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు, తిరుమలేశ్వర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని సంత జూటూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎలగల రామచంద్రుడు ఉపసర్పంచ్ గంటే పోగు బాబురావు పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలోని ఇందిరానగర్ ఎస్సీ కాలనీలో ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని చేతి పంపును గురువారం మరమ్మతులు చేయించారు. బోరును రిపేరు చేయడం ద్వారా తాగునీటి ఎద్దడి ఎలాంటి సమ స్య లేకుండా ఉపయోగపడుతుందని కాలనీ వాసులు అన్నారు.

బోరును మరమ్మతు చేసి నీళ్లు కొడుతున్న ఉపసర్పంచ్